సాక్షి
నంద్యాల
సోమవారం ǀ 3 ǀ మార్చి ǀ 2025



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై ఆదివారం కర్నూలుకు చెందిన వి.ప్రసాద్‌బృందం వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వాగ్వేది ప్రసాద్, మహతి, సాహిత్య, తపస్య, సంధ్య నృత్యం ప్రదర్శించారు.



ప్చ్.. వినపడటం లేదు..!

ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడటం, అధిక శబ్దంతో పాటలు వినడం, బ్లూటూత్, హెడ్‌సెట్ వినియోగించడంతో వినికిడి సమస్య బాధితులు జిల్లాలో అధికమవుతున్నారు. 8లో▸



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దశరథరామమ్ రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:31	ఉ॥ 5:13
ఆదోని	సా॥ 6:31	ఉ॥ 5:13
నంద్యాల	సా॥ 6:30	ఉ॥ 5:12
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 5:12
బనగానపల్లె	సా॥ 6:31	ఉ॥ 5:13

బియ్యం దందా పచ్చగా!

నియోజకవర్గాల వారీగా ముఠాలు

- ఒక్క కర్నూలులోనే 25కు పైగా గ్యాంగులు
- పట్టుకోసం రెండు వర్గాల మధ్య ఆధిపత్యపోరు
- ఎక్కడికక్కడ ఎమ్మెల్యేల పేరు చెప్పుకొని అక్రమ రవాణా
- కళ్లెదుటే సాగుతున్నా నోరు మెదపని అధికారులు
- పోలీసులకు పెద్ద ఎత్తున మామూళ్లు



నియోజకవర్గాల వారీగా 'పచ్చ' ముఠాలు

➤ కర్నూలులో దాదాపు 25 గ్యాంగులు బియ్యం దందాలో ఉన్నాయి.
➤ బుధవారపేటకు చెందిన వ్యక్తి, పాత బస్తీకి చెందిన మరో వ్యక్తి ఆయా గ్యాంగుల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు.
➤ వీరికి పట్టణం నడిబొడ్డున బుధవారపేట, శరీన్‌నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, పంచలింగాలలో గోదాములు ఉన్నాయి. అక్కడి నుంచి బియ్యాన్ని జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు.
➤ కాగా, వీరిద్దరూ ఓ మంత్రికి అనుచరులు.
➤ శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడుకు చెందిన ఓ వ్యాపారి ఓ ఎమ్మెల్యే భర్త ఆశీస్సులతో శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం, కర్నూలులలో బియ్యం సిండికేట్‌కు తెరలేపారు.
➤ డోన్, కోడుమూరు, పత్తికొండలో అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుడు వెల్దుర్తి కేంద్రంగా బియ్యం అక్రమ రవాణా చేస్తున్నాడు. గతంలో ఆయన ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది.
➤ ఆదోనిలో ఓ బీజేపీ నాయకుడు తన కింద 10మందితో బియ్యం దందాను నడిపి కర్ణాటకలోని శిరుగుప్ప, రాయచూరు, బళ్లారి వరకు విస్తరించారు.
➤ ఆలూరు నియోజకవర్గంలో బియ్యం అక్రమ రవాణా వ్యాపారాన్ని గుంతకల్‌కు చెందిన వ్యక్తులు నడిపిస్తున్నారు.
➤ మంత్రాలయం, ఎమ్మిగనూరులో కొంత భాగం వెల్దుర్తి కేంద్రంగా పనిచేసే వ్యాపారి, మిగిలిన భాగాలను కొందరు టీడీపీ నాయకులు కర్ణాటక వ్యాపారులతో కలిసి నిర్వహిస్తున్నట్లు సమాచారం.

కర్నూలు(సెంట్రల్): పేదల బియ్యం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. ఏ స్థాయిలో దందా చేసుకుంటే అంతటి ఆదాయాన్ని సమకూర్చి పెడుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా రేషన్ బియ్యం కోసం మాఫియాలు పుట్టుకొచ్చాయి. నియోజకవర్గాల వారీగా టీడీపీ ప్రజాప్రతినిధుల అనుచరులు ముఠాలుగా ఏర్పడి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రికి రాత్రి రేషన్ బియ్యాన్ని జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. ఇందులో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసు, ఇతర అధికారులందరికీ మామూళ్లు ముడుతున్నట్లు చర్చ జరుగుతోంది. జిల్లాలో నెలకు దాదాపు రూ.100 కోట్లకుపైగా బియ్యం అక్రమ రవాణా వ్యాపారం సాగుతున్నట్లు తెలుస్తోంది. చాలా చోట్ల నేరుగా ఎండీయూ ఆపరేటర్లే బియ్యాన్ని రూ.10 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కలసి అక్రమాలకు పాల్పడుతున్నారు. మరికొన్ని చోట్ల వినియోగదారుల నుంచే నేరుగా తక్కువ ధరకు కొనుగోలు చేసే గ్యాంగులు ఉండటం గమనార్హం.

కర్నూలులో బరితెగించిన రెండు ముఠాలు

అక్రమ బియ్యం దందా జిల్లా అంతటా సగం ఉంటే.. మిగిలిన సగం జిల్లా కేంద్రంలో నడుస్తోంది. ఇక్కడ ఏకంగా 170 చౌకధరల దుకాణాల పరిధిలో 1,100 టన్నుల బియ్యం కేటాయింపులు ఉంటున్నాయి. దీంతో ఇక్కడ పట్టుకోసం టీజీ, గౌరుల పేర్లు చెప్పుకొని వ్యాపారం చేసే వారు బరితెగించారు. కర్నూలులో 25 గ్యాంగుల వరకు పనిచేస్తున్నాయి. వీరంతా ఇద్దరు వ్యాపారులకు ఇన్నాళ్లు బియ్యం ఇచ్చేవారు. అయితే కొత్తగా వెలుగోడు కేంద్రంగా ఓ వ్యక్తి చక్రం తిప్పుతున్నాడు. గౌరు అనుచరుడినంటూ చెప్పుకొని అప్పటికే ఉన్న వారిద్దరిని కూడా తనకే బియ్యం అమ్మాలంటూ హుకుం జారీ చేశాడు. అమ్మకుంటే అంతు చూస్తానని హెచ్చరించినట్లు సమాచారం. ఒకానొక సమయంలో దాడులు కూడా చేసినట్లు తెలుస్తోంది. అయితే చివరకు పోలీసులు కలుగజేసుకొని కర్నూలులో వ్యాపారం చేస్తున్న బాషా, శరణయ్యలను వెలుగోడు వ్యక్తికి సహకరించాలని, లేదంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించి రాజీ చేసినట్లు చర్చ జరరుగుతోంది. అయినప్పటికీ రెండు వర్గాల మధ్య వార్ నడుస్తోందని, ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళన నెలకొంది.



తుగ్గలి మండలం రాంపల్లిలో పట్టుబడిన బియ్యం లారీ



ఎండీయూ వాహనాల ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తున్న దృశ్యం

మిన్నకుండిపోయిన నిఘా వ్యవస్థలు

జిల్లాలో ప్రతి నెలా బియ్యం దందా రూ.100 కోట్ల వరకు జరుగతున్నా పౌరసరఫరా, పోలీసు, విజిలెన్స్ నిఘాలకు మాత్రం దొరకని పరిస్థితి. బహిరంగంగా తెలిసినా ఎవరూ తమకు తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. పైగా అక్రమ బియ్యం ఎక్కడైనా ఉంటే తమకు చెబితే పట్టుకుంటామని పౌరసరఫరాల అధికారులు చెబుతుండడం గమనార్హం. మరోవైపు విజిలెన్స్ ఇన్‌ఫార్మర్లను సైతం పచ్చ ముూకలు కనిపెట్టినట్లు తెలుస్తోంది. వారిని దారికి తెచ్చుకోవడం, లేదంటే భయపెట్టే వరకు వెళ్లడంతో ఆ వ్యవస్థ కూడా దిక్కుతోచని స్థితిలో ఉంటోంది. ఇక పోలీసులు చాలా చోట్ల వారికి అన్నీ తెలిసినా ఏమీ అనకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ బియ్యం దందాలో పోలీసులకు పెద్ద ఎత్తున మామూళ్లు అందుతున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది.

ఇటీవల నమోదైన కొన్ని 6ఏ, క్రిమినల్ కేసులు

➡ ఆదోని పట్టణంలో కోసిగికి చెందిన రాఘవేంద్ర, గోవిందమ్మల నుంచి 5.27 క్వింటాళ్ల బియ్యం, రవాణా వాహనం సీజ్ సీజ్.
➡ కర్నూలు రూరల్ మండలం పంచలింగాల సమీపంలో లారీని సీజ్ చేసి 135 బస్తాల బియ్యం స్వాధీనం. లారీ ఓనర్ ప్రైమ్ సీలో రియాతో పాటు మద్దిలేటి అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు.
➡ పత్తికొండ మండలం హోసూరులో 52 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం. అరుణాక్షి, రామకృష్ణలపై క్రిమినల్, 6ఏ కేసులు.
➡ తుగ్గలి మండలం రాంపల్లి వద్ద లారీ, ఓ కారును సీజ్ చేసి 1100 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం. అనంతపురం జిల్లాకు చెందిన డి.శంకర్, శివప్రసాద్, తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన భాస్కరరెడ్డి, డోన్ మండలం చింతలపేటకు చెందిన వడ్డే సురేష్‌లపై కేసు.
➡ కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌వద్ద 30 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం. కె.మహేష్, జయప్రకాష్ నాయుడు, ఇర్ఫాన్‌పై కేసు.
➡ మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటకకు తరలిస్తున్న 80 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం.
➡ ఆదోని పట్టణం ధణాపురం రోడ్డులో 3.20 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి షేక్ షబ్బీర్‌పై కేసు నమోదు. మరో కేసులో 3.51 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం. వాహనాన్ని సీజ్ చేసి అబ్దుల్ రహిమాన్ అనే వ్యక్తిపై కేసు.

సమాచారం ఇస్తే పట్టుకుంటాం



పేదల బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం తప్పు. కేవలం తినడానికే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఎక్కడైనా బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురండి. దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం. సమాచారం ఇచ్చే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రాజారఘువీర్, డీఎస్‌ఓ, కర్నూలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

నంద్యాల: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు సంస్కారం అవసరం

- జిల్లా జడ్జి జి.కబర్ధి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.కబర్ధి

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు చదువే కాదు సంస్కారం కూడా అవసరమని జిల్లా జడ్జి జి.కబర్ధి అన్నారు. ఆదివారం ఓల్డ్‌సిటీ చిదంబరావు వీధిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు, సంస్కారం అందించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ ముఖ్య వక్తగా హాజరై సందేశమిచ్చారు. పారిశ్రామికవేత్త శేరి బాలనాగరాజు, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యసభ్యులు సుబ్బలక్ష్మయ్య, వసతి గృహం అధ్యక్షులు బి.చిరంజీవి రెడ్డి, కార్యదర్శి కె.బాలాజీరావు మాట్లాడారు.

మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఇన్‌పుట్ డీలర్లను ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత సూచించారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఆదివారం ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ మాట్లాడుతూ.. పురుగుమందులు ఎక్కువగా వాడుతుండటంతో ఆహార పంటలు, కూరగాయల్లో వాటి అవశేషాలు ఉంటున్నట్లు స్పష్టమవుతోందన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త జయచంద్ర పాల్గొన్నారు.

'ఎక్సైజ్' సంఘం అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కర్నూలుగా ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలు ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో జిల్లా డీపీఈఓ మచ్చా సుధీర్‌బాబు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సోమశేఖర్ (డోన్ ఎస్‌ఐ), ఉపాధ్యక్షులుగా భార్గవ్‌రెడ్డి (కోసిగి ఎస్‌ఐ), ప్రధాన కార్యదర్శిగా సందీప్ (కోవెలకుంట్ల ఎస్‌ఐ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రమేష్‌రెడ్డి (ఎమ్మిగనూరు సీఐ), సహాయ కార్యదర్శిగా రహెనాబేగం (కర్నూలు ఎస్‌ఐ), కోశాధికారిగా దుర్గా నవీన్‌బాబు (కర్నూలు ఎస్‌ఐ), కార్యవర్గ సభ్యులుగా ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, రమాదేవి, శేషాచలం, సబ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్ నాయక్, ఇంద్ర కిరణ్ తేజ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సుధీర్‌బాబు తెలిపారు.

ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అహోబిలం మఠం పీఠాధిపతి

ఆళ్లగడ్డ: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలని అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ అన్నారు. అహోబిలం క్షేత్రంలో ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాధిపతి ప్రసంగిస్తూ.. నేటి యువత ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండి రేపటి తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. అహోబిలం క్షేత్రం చరిత్ర, ప్రాశస్త్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మఠం ప్రతినిధి శ్రీకార్యం, ప్రధానార్చకులు వేణుగోపాలన్ పాల్గొన్నారు.



హాజరైన హరే రామ హరే కృష్ణ భక్తులు

ఘనంగా గురు వైభవోత్సవాలు

మంత్రాలయం: ప్రహ్లాదరాయల వరదుడు.. యతి వరేణ్యుడు శ్రీరాఘవేంద్ర స్వామి గురు భక్తి వైభవోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో వేకువ జామున సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పూజా మందిరంలో పీఠాధిపతి చేపట్టిన మూల, జయ, దిగ్విజయ రాముల సంస్థాన పూజలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేద మంత్రోచ్చారణలు, భక్తి కీర్తనలు, మంగళవాయిద్యాల మధ్య అర్చన, అభిషేకాది పూజలు, దివిటీ సేవలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనానికి పంచామృతాభిషేకం గావించి పుష్పాలంకరణ చేపట్టి హారతులు పట్టారు. వేడుకల సందర్భంగా యోగీంద్ర మంటపంలో కేంద్ర రైల్వే సహాయక మంత్రి సోమన్న రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్థి అవార్డు అందుకున్నారు. అదే మంటపంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన విదూషి నారాయణ కర్ణాటక సంగీత విభావరి, బెంగళూరుకు చెందిన కడప హనుమేష్ ఆచార్ వీణానాద ప్రదర్శన అలరించాయి. ఉత్సవాల్లో ఏఏవో మాధవ శెట్టి, సలహాదారు శ్రీనివాసరావు, మేనేజర్ వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, మేనేజర్-సి సురేష్ కోనాపూర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



ఆదివారం సాయంత్రం కర్నూలు రెవెన్యూ కాలనీలో ఉపవాసం విడిచి ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

పవిత్ర మాసం ప్రారంభం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రంజాన్ నెల ఉపవాస దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముస్లింలు సహెరీతో దీక్షలు చేపట్టారు. ఐదు పూటలా నమాజు చదివారు. సాయంత్రం ఇఫ్తార్ సమయంలో ప్రార్థనలు చేసి దీక్షను విరమించారు. నెల రోజుల పాటు నియమ నిష్ఠలతో రంజాన్ దీక్షలు కొనసాగనున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సర్కారు నిర్లక్ష్యం.. కాటేస్తున్న అతిసారం

- 9 నెలల కూటమి పాలనలో అతిసారంతో 11 మంది మృతి
- ప్రజల ప్రాణాలు పోతున్నా పాఠాలు నేర్వని ప్రభుత్వం
- ఆత్మకూరు పట్టణంలో మూడుకు చేరిన మృతుల సంఖ్య



ఆత్మకూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం దేవుడెరుగు.. కనీసం తాగేందుకు సురక్షిత నీరు అందని పరిస్థితి నెలకొంది. కలుషిత జలం ప్రజల ప్రాణాలను హరిస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. జిల్లాలో ప్రతి నెల ఏదో ఒక ప్రాంతంలో డయేరియా పంజా విసురుతున్నా చర్యలు చేపట్టడంలో విఫలమవుతూనే ఉంది. 9 నెలల పాలనలో అతిసారంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంతో తరచూ తాగునీరు కలుషితమై అతిసారం ప్రబలి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన మంచినీటి పైప్‌లైన్ మార్పుపై దృష్టి సారించడం లేదు. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల ద్వారా ఇప్పటికీ కుళాయిలకు నీటి సరఫరా అవుతోంది. కొన్ని చోట్ల డ్రైనేజీ కాల్వలో మంచినీటి పైప్‌లైన్లు వెళ్లాయి. వీటి ద్వారా తరచూ నీరు కలుషితమై ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. అతిసారం ప్రబలిన చోట అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా ఆత్మకూరులో అతిసారం బారిన పడిన మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. ఆయా కాలనీలకు నీటిని సరఫరా చేసే జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పైపులు పాచిపట్టి కనిపిస్తున్నాయి. ట్యాంకులను శుభ్రం చేయాలని కొద్ది నెలలుగా స్థానికులు కోరినా అధికారులు పట్టించుకోలేదు. రెండు వారాలుగా దుర్వాసన, బురద ఉన్న నీరు వస్తుందని చెప్పినా వినలేదు. ఇంతలోనే కలుషిత నీటిని తాగి సుమారు పది మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో బషిరూన్, రహంతుల్లా, రామచంద్రనాయక్ మృతి చెందారు. అధికారులు సకాలంలో స్పందించి చర్యలు తీసుకొని ఉంటే ముగ్గురు బతికేవాళ్లని మృతుల బంధువులు చెబుతున్నారు.

పరిహాసమవుతున్న పరిహారం హామీలు

డయేరియాతో చనిపోయిన మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు ఈ ప్రభుత్వానికి మనసు రావడం లేదు. జూపాడుబంగ్లా మండలం చాబోలు గ్రామంలో డయేరియాతో నడిపి నాగన్న చనిపోయిన సమయంలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మృతుని కుటుంబాన్ని విడివిడిగా పరామర్శించి ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో డయేరియాతో రామలక్ష్మిదేవి మరణించినప్పుడు ఎమ్మెల్యే జయసూర్య బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తూ ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు. గతేడాది సెప్టెంబర్‌లో ఆళ్లగడ్డలో ఆరుగురు చనిపోతే కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పట్టించుకోలేదు. అసలు ఆళ్లగడ్డలో అతిసారనే లేదని, చనిపోయిన వారంతా వివిధ అనారోగ్య సమస్యలతో మరణించారని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో అతిసారంతో ముగ్గురు మృతి చెందినా స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఇప్పటి వరకు కన్నెత్తి చూడలేదు. పేదల ప్రాణాలు పోతున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డయేరియాతోనే మా నాన్న చనిపోయాడు



వారం రోజుల నుంచి మా ఇంట్లో ఐదుగురం వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నాం. మేమంతా త్వరగానే కోలుకున్నాం. మా నాన్న రామచంద్రనాయక్‌కు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికంగా ఓ క్లినిక్‌లో చూపించాం. అయినా తగ్గకపోవడంతో 27వ తేదీ కర్నూలు పెద్దాసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. డయేరియాతోనే చనిపోయాడు. మా నాన్నకు బీపీ, షుగర్ కూడా లేవు. గత కొద్దిరోజుల నుంచి నీళ్లు, సరిగ్గా రావడం లేదని చెబుతూనే ఉన్నాం. అయినా అధికారులు పట్టించుకోలేదు.

– వెంకటేశ్వరనాయక్, గొల్లపేట, ఆత్మకూరు

శిథిలమైన పైప్‌లైన్లు తొలగిస్తాం



అతిసార బాధితులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు: మంచినీరు కలుషితం కాకుండా శిథిలమైన పైప్‌లైన్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధి, గొల్లపేటలో ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పర్యటించారు. అతిసార వ్యాధితో షేక్‌బషీరిన్, రహంతుల్లా, రామచంద్రనాయక్ ఇటీవల మృతిచెందగా వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అతిసారం అనుమానంతో అన్ని పరీక్షలు నిర్వహించామని, మంచినీరులో ఎక్కడా కలుషితమైనట్లు నివేదికలు లేవన్నారు. ఆత్మకూరు పట్టణంలో ఎన్నో ఏళ్ల క్రితం ఎనిమిది అడుగుల లోతులో మంచినీటి పైపులైన్లను ఏర్పాటు చేశారని, వాటిని పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరులో రెండు మినరల్ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేశామన్నారు. అన్ని మినరల్ వాటర్ ప్లాంట్‌లతో పాటు పట్టణంలోని ఇతర ప్రయివేట్ యజమానులకు సంబంధించిన వాటర్ క్యాన్‌లను, నీటి సరఫరా చేసే బోర్లలోని నీటిని పరీక్షలకు పంపుతున్నట్లు చెప్పారు. ఇటీవల ఓ కంపెనీకి చెందిన చికెన్ నిర్వాహకులు ఉచితంగా గుడ్లు, చికెన్ పంపిణీ చేశారని, దాని ద్వారా ఏమైనా వ్యాధి సోకిందా అనే విషయంపై పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అన్ని హోటళ్లు, చికెన్ సెంటర్‌లను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రత్నరాధికను ఆదేశించారు. పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో నీలితొట్టి వీధి, గొల్లపేట వీధిలో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందించాలన్నారు. అనంతరం ఆత్మకూరు సీహెచ్‌సీ కేంద్రాన్ని పరిశీలించి బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ కాంతారావునాయక్, ఆర్‌డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫక్కీరయ్య, డీసీహెచ్‌ఎస్ జబీవుల్లా, డాక్టర్లు షాదియాబేగం, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రముఖ విద్యావేత్త రాయసం రత్నస్వామి మృతి



విద్యావేత్త రత్న స్వామి (ఫైల్)

వెలుగోడు: ప్రముఖ విద్యావేత్త, వెలుగోడు గ్రామ నివాసి డాక్టర్ రాయసం రత్న స్వామి (90) ఆదివారం స్వగృహంలో వయోభారంతో కన్నుమూశారు. వెలుగోడులో అనేక విద్యాసంస్థలకు సారథ్యం వహించిన ఈయన నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. సర్దార్ పటేల్ ఐటీఐను స్థాపించారు. ముస్లిం మైనార్టీల కోరిక మేరకు స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో స్థానికంగా ఉర్దూ కళాశాల స్థాపించారు. సామాజిక సేవలో భాగంగా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసి తన సేవలను జిల్లా వ్యాప్తంగా అందించారు. అలాగే వృద్ధాప్య ఆశ్రమాన్ని స్థాపించి వృద్ధులకు వసతి కల్పించారు. అవివాహితుడైన రత్న స్వామి మృతి విషయం తెలియగానే గ్రామస్తులు, విద్యావేత్తలు, మేధావులు సంతాపం తెలియజేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

గోనెగండ్ల: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. లక్షరూపాయలు సాయం అందజేసి గొప్ప మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే..గోనెగండ్లలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పూజారి ఒంకార్ (48)కు భార్య పూజారి లత, కూతురు, కుమారుడు ఉన్నారు. మోటర్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే ఈయనకు వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు పెంచికల పాడు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గోనెగండ్ల జెడ్పీ హైస్కూల్ 1992–93 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు, మెకానిక్ యూనియన్ సభ్యులు ఒంకార్ స్వగృహానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. లక్ష సాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఛ్చ్.. వినపడటం లేదు..!

- బ్లూటూత్, హెడ్‌ఫోన్లతో వినికిడి సమస్య
- పెద్దగా మ్యూజిక్ వినడంతో ఇబ్బందులు
- కొందరికి పుట్టుకతో వినికిడి లోపం
- పరిష్కారం చూపుతున్న ఆధునిక హియరింగ్ ఎయిడ్‌లు
- నేడు ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినం





వినికిడి సమస్య పరిష్కారానికి అధునాతన పరికరం అమర్చుతున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): స్మార్ట్ ఫోన్ అధిక వినియోగం ఎన్నో అనర్థాలకు దారి తీస్తోంది. ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వినికిడి సమస్య బాధితులు పెరుగుతున్నారు. ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడటం, అధిక శబ్దంతో పాటలు వినడం, బ్లూటూత్, హెడ్‌సెట్ వినియోగించడం తదితర కారణాలతో వినికిడి సమస్య ఏర్పడి బాధితులు అవస్థలు పడుతున్నారు. ఎదుటి వారు చెప్పేది సరిగా వినిపించకపోతే తలెత్తే సమస్య అంతా ఇంతా కాదు. వినికిడి సమస్యను అధిగించేందుకు ఏటా మార్చి 3న ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో వినికిడి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. ఐదేళ్ల క్రితం జిల్లాలో వీరి సంఖ్య 4వేల దాకా ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య 5 వేలు దాటిందని వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు పాక్షికంగా సమస్య ఉన్న వారి సంఖ్య ఇందుకు మూడింతలు ఉంటుందని వారి అంచనా. కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలో చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్యుల వద్దకు చెవిలో ఇబ్బందులతో రోజుకు సగటున 250 నుంచి 300 మంది వస్తుండగా అందులో వినికిడి సమస్యతో బాధపడే వారు 40 శాతానికి పైగా ఉంటున్నారు. ఇలాంటి వారు సరిగ్గా వినపడని కారణంగా శారీరక, మానసిక సమస్యలతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య కొందరికి పుట్టుకతో వస్తుండగా మరికొందరికి ప్రమాదాల్లో సమస్య ఏర్పడుతోంది.

వినికిడి పరీక్ష ఇలా చేయించుకోవాలి

వినికిడి సమస్య ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే ఈఎన్‌టీ వైద్యులు, ఆడియాలజిస్టు వద్దకు వెళ్లి ఆడియోమెట్రి పరీక్ష చేయించుకోవాలి. దీనివల్ల ఎంత శాతం వినికిడి కోల్పోయింది. ఎందువల్ల అని నిర్ధారణ అయితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఆడియోమెట్రిక్ పరీక్ష చేయించుకున్న తర్వాత సెన్సార్ హియరింగ్ లాస్ అయితే వినికిడి మిషన్, హియరింగ్ ఎయిడ్ తప్పనిసరిగా వాడాలి. దీనివల్ల చిన్న శబ్దాలు, మాటలు మొదలుకొని దూరం నుంచి వచ్చే శబ్దాలు, మాటలు చక్కగా వినిపిస్తాయి. ఉన్న వినికిడి లోపం పెరగకుండా కాపాడుకోవచ్చు.

సమస్యను పరిష్కరిస్తున్న వినికిడి మిషన్లు

ఆధునిక టెక్నాలజీతో కంప్యూటరైజ్డ్ వినికిడి మిషన్లు వచ్చాక చాలా మంది వాటిని వాడటం సులభంగా మారింది. వీటిని వైద్యులు చెవిలోపల, చెవి వెనుక కనిపించకుండా అమరుస్తారు. ఇవి వాడటం వల్ల మనకు ఎంత వినికిడి శక్తి కావాలో అంతే తీసుకుంటుంది. నాయిస్ రిడక్షన్ ఆప్షన్ ఉండటం, అడ్వాన్స్ టెక్నాలజీ రిమోట్ కంట్రోల్ హియరింగ్ ఎయిడ్స్ ద్వారా మనం ఎంత సౌండ్ కావాలో ఈ టెక్నాలజి ఉపయోగపడుతుంది. పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న పిల్లలకు వినికిడి మిషన్లు అమర్చి స్పీచ్‌థెరపీ ఇప్పిస్తే వారు త్వరగా మాటలు వినడమే గాక అర్థం చేసుకుని తిరిగి మాట్లాడేందుకు సులభం అవుతుంది. వినికిడి మిషన్ వాడటం వల్ల చిన్నశబ్దాలు, మాటలు మొదలుకొని దూరం నుంచి వచ్చే శబ్దాలు, మాటలు చక్కగా వినగలరు. ఉన్న వినికిడి లోపం పెరగకుండా కాపాడుకోగలరు. చెవిలో నుంచి శబ్దం తగ్గుతుంది.

వినికిడి సమస్యకు కారణాలు

- ధ్వని ఎక్కువగా ఉండే పరిసరాల్లో ఉండటం
- మొబైల్, బ్లూటూత్, హెడ్‌ఫోన్‌లలలో పెద్దశబ్దంతో మ్యూజిక్ వినడం
- వాహనాల శబ్దాలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో ఎక్కువసేపు ఉండటం
- జన్యుకారణాలు, పుట్టుకతో వచ్చే లోపాలు
- మేనరికం, వంశపారంపర్యంగా రావడం
- వృద్ధాప్యం, చెవి మధ్యలో ఇన్‌ఫెక్షన్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెవి శుభ్రతకు బడ్స్, పిన్ను సూదులు తదితరాలు ఉపయోగించకూడదు.
- చెవిలో నొప్పికి నూనె, ఆకుపసర్లు వేయకూడదు.
- చెవిలో చీము కారుతుంటే స్విమ్మింగ్ చేయకూడదు.
- చెవిలో నీరు పోకుండా నూనె అంటిన దూదిని చెవిలో పెట్టుకోవాలి.
- ఎక్కువ శబ్దాలు వచ్చే ప్రదేశంలో పనిచేసే వారు ఇయర్ ప్లగ్స్ వాడాలి.
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి వినికిడి పరీక్ష చేయించుకోవడం మంచిది.

వినికిడి సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు



చెవిలో సమస్య వచ్చిన వారు నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలి. చెవి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కొన్నిసార్లు అవి వినికిడి లోపానికి దారి తీసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు చిన్నపిల్లల్లో దగ్గు, జలుబు వచ్చినప్పుడు చెవి బ్లాక్ అవుతుంది. దానివల్ల కొన్నిసార్లు వినికిడి సమస్య రావచ్చు. చెవిలో రంధ్రం పడితే మైరింగోప్లాస్టీ ఆపరేషన్ చేస్తాం. పెద్దల్లో నరాల బలహీనత వల్ల వినికిడి సమస్య వస్తుంది. వీరికి ఆడియోమెట్రీ పరీక్ష చేసి మందులు వాడాల్సి ఉంటుంది. తగ్గకపోతే హియరింగ్ ఎయిడ్ వాడాల్సి వస్తుంది.

– డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఈఎన్‌టీ వైద్యులు, కర్నూలు

సరైన హియరింగ్ ఎయిడ్ వాడాలి



వినికిడి సమస్య ఉన్న వారు అవసరమైన చికిత్సను పొందక పోయినా, వినికిడి మిషన్‌ను ఉపయోగించకపోయినా, ఎక్కువగా సెల్‌ఫోన్ రేడియేషన్, శబ్ద కాలుష్యానికి గురైనా వారి వినికిడి సామర్థ్యం మరింత క్షీణిస్తుంది. కొన్ని సంవత్సరాల తర్వాత పూర్తిగా వినికిడి శక్తి కోల్పోతారు. సరైన హియరింగ్ ఎయిడ్, లిజనింగ్ ట్రైనింగ్ ద్వారా వినికిడి లోపం తగ్గించవచ్చు. బ్యాలెన్స్ సమస్యను బ్యాలెన్స్ థెరపి సహాయంతో పరిష్కరించవచ్చు. వినికిడి సమస్య ఉన్న వారు ఆడియాలజిస్టును సంప్రదిస్తే పరీక్షించి అవసరమైన పరికరాన్ని అమరుస్తారు. మిషన్లు పెట్టుకోవడానికి నామోషీ పడేవారికి చెవిలోపల కూడా అమర్చే మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. – రోజా బంగి, ఆడియాలజిస్టు, కర్నూలు

పెద్దాసుపత్రిలో వృద్ధురాలికి అరుదైన చికిత్స



ఎండోస్కోపి ద్వారా పోయమ్ విధానంలో రోగి అన్నవాహికను కట్ చేసి తొలగిస్తున్న వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఆహారం, నీళ్లు మింగలేక ఇబ్బంది పడుతున్న వృద్ధురాలికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు ఆపరేషన్ అవసరం లేకుండా ఎండోస్కోపి ద్వారా చికిత్స చేసి సమస్య పరిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన అహ్మద్‌బీ (65) కొంత కాలంగా ఆహారం, నీళ్లు మింగలేక ఇబ్బంది పడుతోంది. ఈ మేరకు ఇటీవల ఆమె చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగానికి వచ్చింది. ఆమెను పరీక్షించిన ఆ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రెడ్డి అకలేషియా కార్డియా అనే జబ్బుతో బాధపడుతోందని నిర్ధారించారు. సాధారణంగా ఇలాంటి సమస్యకు ఆపరేషన్ ద్వారా పరిష్కరిస్తారు. కానీ ఆపరేషన్ అవసరం లేకుండా ఆదివారం ఎండోస్కోపి పరికరంతో పరోరల్ ఎండోస్కోపిక్ మయాటమి(పోయమ్) అనే విధానం ద్వారా అన్నవాహికలో దెబ్బతిన్న కండరాన్ని కట్‌చేసి తొలగించారు. ఇదే చికిత్సను డోన్ మండలం ధర్మవరానికి చెందిన రఘుయాదవ్(30) అనే యువకుడికి కూడా నిర్వహించారు. కోత, కుట్లు లేని ఈ చికిత్స వల్ల రోగి త్వరగా కోలుకుంటారని, రక్తస్రావం ఉండదని డాక్టర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి చికిత్సకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, ఈ ఆసుపత్రిలో తాము ఉచితంగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముసలాయిచెర్వు గ్రామంలో గత నెల 25వ తేదీన జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. ముసలాయి చెర్వుకు చెందిన పల్లె రాములమ్మ, కొడుకు మహేశ్వర్‌రెడ్డి పొలం గట్టు విషయంలో పాత కక్షలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన కుంచె రామేశ్వర్‌రెడ్డి, కొడుకు సుదర్శన్‌రెడ్డిపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మండలంలోని రంగాపురం గ్రామంలో ఇద్దరు నిందితులు ఉన్నారనే సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేశారు. డోన్ కోర్టులో హాజరు పరుచగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులు గురుబాబు, శ్రీను, దస్తగిరి, రాజు నాయక్, సురేష్ కుమార్, వెంకటేష్‌ను సీఐ అభినందించారు.

విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడుకు 'గాడిచర్ల పురస్కారం'



సుబ్బరాయుడుకు గాడిచర్ల పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ ఎం.సుబ్బరాయుడుకు 29వ 'గాడిచర్ల పురస్కారం'ను ఆదివారం ఆయన స్వగృహంలో ప్రదానం చేశారు. ఆంధ్ర తిలక్ గాడిచర్ల హరి సర్వోత్తమ రావు 66వ వర్ధంతిని పురస్కరించుకొని గాడిచర్ల ఫౌండేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ, ఏపీ గ్రంథాలయ సంఘం, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్న గాడిచర్ల పురస్కారాన్ని ఈఏడాది సుబ్బరాయుడుకు చల్లా కాంపౌండ్‌లోని ఆయన స్వగృహంలో అందజేశారు. అనంతరం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ప్రకాశం సభా భవనంలో గాడిచర్ల వర్ధంతి సభ జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాడిచర్ల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ విజ్ఞాన వేత్త సాగు, తాగు నీటి కోసం శ్రమించిన సుబ్బరాయుడు పనిలో దైవాన్ని చూసే వారన్నారు. నీటిని పదిలం చేసే పనిలో వంద శాతం కృషి చేశారన్నారు. రాయలసీమకు సాగు, తాగు నీరు కోసం విశేషంగా శ్రమించారన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ లైబ్రరీకి గాడిచర్ల హరిసర్వోత్తమ రావు పేరు పెడతామన్నారు. గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ కృష్ణా నదిపై సిద్ధేశ్వరం అలుగు, తుంగ భద్రపై గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి నదిపైన ఎత్తిపోతల పథకం కడితే కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పిన దార్శనికుడు సుబ్బరాయుడని కొనియాడారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, రాయలసీమ జల సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీ బె బెటాలియన్ డీఎస్పీ మహబుబ్ బాషా, గ్రంథాయల సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, మధుర కవి ఎలమర్తి రమణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు దండెబోయిన పార్వతీ దేవి, డాక్టర్ రాధారాణి, చరిత్ర విభాగాధిపతి జయలక్ష్మి, ఉపన్యాసకులు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘము, నంద్యాల

ఆర్.ఓ.సి.నెం. 301/2015/ఏ1 తేది: 01.03.2025

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025–26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి నంద్యాల పురపాలక సంఘము అధీనమందు గల డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్ తేది: 12.03.2025న ఉదయం:10:30 గంటలకు మరియు షాపింగ్ కాంప్లెక్స్‌లలోని ఖాళీగా వున్న షాపు రూములను తేది:12.03.2025 ఉదయం: 11:30 గంటలకు పురపాలక సంఘ కార్యాలయం నందు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడునని తెలియజేయడమైనది.

వేలములు నిర్వహించు మునిసిపల్ మార్కెట్ వివరములు:

వ.సం.	షాపు రూములు/మార్కెట్ వివరములు	లీజుకాలము
1	డైలీ కూరగాయల మార్కెగ్ గేట్స్	01.04.2025 నుండి 31.03.2026 అర్ధరాత్రి వరకు
2	కూరగాయల మార్కెట్‌లోని సైకిల్ స్టాండ్	
3	మాంసం మరియు చేపల మార్కెట్లు	
4	పశువుల సంత	

వేలములు నిర్వహించు మునిసిపల్ షాపు రూముల వివరములు:

వ.సం.	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు రూము నెం.
1	పాత మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	1N(FF), 4N-5N(FF), 6N-7N(FF), 8N-9N(FF)
2	మునిసిపల్ హైస్కూలు దగ్గర	8(FF-ST), 11-12(FF)
3	ఆర్.ఎఫ్.రోడ్	1,2,3
4	సత్రంబడి	01, 05(FF), 06(FF)
5	గర్ల్స్ హైస్కూల్ ప్రక్కన	03, 04, 08(FF), 09(FF)

సదరు బహిరంగ వేలము నందు పాల్గొనదలచిన వారు ఇతర వివరముల కొరకు మునిసిపల్ కార్యాలయములోని రెవెన్యూ విభాగము నందలి ఏ1 గుమాస్తను కార్యాలయపు పని వేళలలో సంప్రదించగలరు మరియు పాటలో పాల్గొనదలచినవారు పాటకు 3 రోజుల ముందుగా సాల్వెన్సీని కార్యాలయములోని ఏ1 గుమాస్తాకు అందచేయవలసినదిగా తెలియజేయడమైనది.

కమీషనరు, నంద్యాల పురపాలక సంఘము

విద్యార్థిని శ్రీలేఖ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

కర్నూలు(సెంట్రల్): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని జి.శ్రీలేఖ కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల సి.బెళగల్ మండలం పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సైన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలేఖతో పాటు మరో ఆరుగురిపై చెట్టు కొమ్మ విరిగి పడగా తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలుపెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీలేఖ ఆదివారం చనిపోవడంతో విషయాన్ని కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా రూ.5 లక్షలు మంజూరు చేశారు. బాలిక మృతి దురదృష్టకరమని చెప్పారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి

కర్నూలు(అగ్రికల్చర్): విలీనం తర్వాత అతి పెద్ద బ్యాంకుగా అవతరించనున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించే విధంగా ప్రభుత్వాన్ని కోరుతామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రామకృష్ణ అన్నారు. ఆదివారం ఏపీజీబీ అధికారుల సంఘం ప్రతినిధులు బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలసి వినతిపత్రం సమర్పించారు. ప్రధాన కార్యాలయాన్ని కడపకు తరలించడం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరుతామని తెలిపారు. ఆర్థిక శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కూడా ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాల్సి ఉందని తెలిపారు. అభివృద్ధి మొత్తాన్ని అమరావతిలోనే కేంద్రీకృతం చేస్తే ప్రాంతీయ విభేదాలు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఏపీజీబీ అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు నేడు వీఆర్‌పీఎస్ ధర్నా

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి/ బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలనే ప్రధాన డిమాండ్‌పై సోమవారం ఉదయం 11.30 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మొలగవెల్లి రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాల్మీకి/ బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా జిల్లా నలుమూలల నుంచి వాల్మీకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

దాన ధర్మం..పుణ్యఫలం!

- రంజాన్ మాసం ప్రత్యేకం
- జకాత్, ఫిత్రాకు అత్యధిక ప్రాధాన్యత
- ఒక రూపాయి దానం చేస్తే 70 రెట్లు ఫలితం



గడివేముల: ముస్లింలకు అత్యంత ప్రీతికరమైనది రంజాన్ మాసం. జీవితాన్ని, జీవిత గమనాన్ని మార్చి మనసుకు ప్రశాంతత ఇచ్చే ఈ మాసంలో ఇస్లామియ బోధనల ప్రకారం నడుచుకుంటారు. దీనివల్ల మిగతా 11 నెలలు కూడా అదే విధంగా జీవించేలా అలవాటు అవుతుందని ముస్లింల నమ్మకం. ఇదే కాకుండా ఆరాధన విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైంది. విధిగా చేయాల్సిన సమాజ్, రోజా, జకాత్, హజ్ వంటి ఆరాధనలే కాదు. దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఖురాన్ ఆదేశాల ప్రకారం చేసిన ప్రతి మంచి పని ఆరాధన కిందికే వస్తుంది. అందుకే రంజాన్ మాసంలో చేసే ఏ పనులకైనా 70 రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఒక రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. అందుకే ఈ మాసంలో అందరూ దానం చేస్తారు.

దానధర్మాలు రెండు రకాలు

సమాజంలో నిర్భాగ్యులు, అనాథలను ఆదుకోవడానికి దానం చేయాలని ఇస్లాం బోధిస్తుంది. అందుకే ముస్లింలు రంజాన్ మాసంలో ఇతోధికంగా దాన ధర్మాలు చేస్తుంటారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. ఇస్లాంలో దానధర్మాలు రెండు రకాలు ఒకటి తప్పనిసరిగా చేయవలసినది జకాత్. అంటే తన వద్ద ఉన్న సంపదలో 2.5 శాతం పేదలకు పంచాలి. ఇలా చేయడం ద్వారా సంపద శుద్ధి అవుతుందని నమ్మకం. రెండోది ఫిత్రా. రంజాన్ మాసం తర్వాత రోజు ఈద్ నమాజ్ కన్నా ముందు ఫిత్రా తప్పనిసరిగా చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరి పేరిట ఫిత్రా దానం తప్పనిసరిగా చేయాలి. రెండు కిలోల 50 గ్రాముల ధాన్యం లేదా గోధువులు లేదా వాటి మార్కెట్లో వాటి ధరకు సరిపడ సొమ్మునైనా పేదలకు దానంగా చేయాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవాలన్నది ఈ సాయం ఉద్దేశం.

అల్లా ప్రసాదించిన మాసం



మానవుల అధికంగా పుణ్యం చేకూర్చేందుకే అల్లా ప్రసాదించిన నెల రంజాన్. ఈ మాసంలో ఆధ్యాత్మికతలో గడపాలి. నిరుపేదలకు ఫిత్రా, జకాత్ చేయాలి. నిష్ఠతో ఉప వాసం ఉండాలి. ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగా చేసుకునేలా చూడాలి. సాధ్యమైనంత వరకు మంచి పనులు చేయాలి. అప్పుడే అల్లా కరుణిస్తాడు. ఈ మాసంలో చిన్న దానం చేసినా పుణ్యం లభిస్తుంది.

–ఖాజీ మౌలానా షేక్ అబ్దుల్ రెహమాన్ రషాది, ప్రభుత్వఖాజీ, గడివేముల మండలం

దానం చేస్తే రెట్టింపు పుణ్యం



రమదాన్ మాసంలో రూ.1 దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. తను ఉన్న ఇల్లు కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే సంపదలో 2.5 శాతం జకాత్‌గా చెల్లించాలి. ఇది అల్లా ఆదేశం. రంజాన్ మాసంలో రోజా ఉండటం ఎంత ముఖ్యమో పేదలకు సాయం చేయడం కూడా అంతే ముఖ్యం.

–హఫీజ్ జాఫర్ ఉసేన్,మంచాలకట్ట.



కర్నూలు నగరంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎస్ఐ శిక్షణలో ప్రతిభ



పోలీస్ ఉన్నతాధికారి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న చైతన్య స్వరూపరాణిపరాణి

కర్నూలు: కర్నూలు పట్టణం ప్రకాష్‌నగర్‌కు చెందిన చైతన్య స్వరూపరాణి ఎస్ఐ శిక్షణలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ నెల 1వ తేదీన అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. ఈ నేపథ్యంలోనే చైతన్య స్వరూపరాణి ఫైరింగ్‌లో బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ట్రోఫీ అందుకున్నారు. కర్నూలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతుల కూతురు చైతన్య డిగ్రీలో బయో టెక్నాలజీ పూర్తి చేశారు. పత్తికొండకు చెందిన వెంకటేశ్వర్లు ఉద్యోగ రీత్యా కర్నూలులో ఉంటున్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకొని పోలీస్ శాఖలో ఎస్ఐ పోస్టును సాధించినట్లు చైతన్య తెలిపారు. 12 నెలల శిక్షణ కాలంలో ప్రతిభను చూపినందుకు గోల్డ్ మెడల్ దక్కిందని, మే నెల నుంచి నెల రోజుల పాటు ఏపీఎస్‌పీ కర్నూలు బెటాలియన్‌లో శిక్షణ పొందనున్నట్లు చైతన్య తెలిపారు. తనను అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు ఆమె తెలిపారు.

హ్యాండ్‌బాల్ విజేత కల్లూరు జట్టు



కప్పు అందుకుంటున్న కల్లూరు బడేసాహెబ్ హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ ఇన్విటేషన్ పోటీల్లో కల్లూరుకు చెందిన బడే సాహెబ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. బహుమతుల కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొని మాట్లాడారు. ఇన్విటేషన్ పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. జిల్లాలోనే కర్నూలుకు హ్యాండ్‌బాల్ క్రీడలో మంచి పేరు ఉందని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులు ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.